క్లుప్తంగా

నేడు పమిడిముక్కలలో ప్రజా వేదిక

పామర్రు(పమిడిముక్కల): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ ఫలితాలను చర్చించటానికి పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.సుధా ప్రవీణ శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ వేతన దారులు, సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు ఈ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కోరారు.

పెదపారుపూడిలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గుడివాడటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహార విలువలు వివరించి వారికి అవి అందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సీడీపీఓ విజయ ఫ్లొరెన్స్ అన్నారు. స్థానిక సత్యన్నారాయణపురం లోని 425, 426 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్‌లు, చిన్నారులు, సూపర్‌వైజర్‌లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు జ్యోతి, జయంతి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాలు తనిఖీ



మండవల్లి: మండలంలోని లోకుమూడి గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎరువులు, పురుగు మందుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎరువులు, పురుగు మందుల ధరలు స్టాక్ బోర్డ్‌లో ప్రకటించాలన్నారు. ఏట మాట్లాడుతూ లైసెన్స్ గడువు లోపే రెన్యువల్ చేయించుకోవాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హనుమంతుని వాహనంపై రాములోరి ఊరేగింపు



జమీదగ్గుమిల్లి(పామర్రు): మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి శాంతి కల్యాణం అనంతరం గురువారం రాత్రి ఉత్సవ మూర్తులను హనుమంతుని వాహనంపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. గ్రామంలోని పుర వీధుల వెంట మేళ తాళాలతో వేద మంత్రాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆర్.గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల రామదాసు, శీతాల శ్రీనివాసరావు, రావూరి అచ్చుతరావు, ఉమ్మడిశెట్టి దుర్గానాగ మల్లేశ్వరరావు, కూనపరెడ్డి చెన్నా రాయుడు, స్థానికులు కూనపరెడ్డి ఉదయ భాస్కరరావు, అమ్మాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాడి వేడిగా పీఏసీఎస్ సమావేశం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. పీఏసీఎస్ చైర్‌పర్సన్ కైల శ్రీవల్లి, సీఈవో కట్టా వెంకట రమణ ఒకరిపై ఒకరు పరస్పరారోపణలు చేసుకోవడం సంచలనం కలిగించింది. సీఈఓ విధులు సక్రమంగా నిర్వహించటం లేదని, క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు చైర్‌పర్సన్ ఆరోపించారు. అందుకు సీఈఓ వెంకట రమణ బదులిస్తూ తాను ఏ విధమైన నిధుల దుర్వినియోగం చేయలేదని చెప్పడమే కాకుండా చైర్‌పర్సన్ పదవికి కావల్సిన అర్హతలు శ్రీవల్లికి లేవని అనడం వివాదానికి దారితీసింది. పాలకమండలి జారీ చేసిన ఉత్తర్వులను పోస్ట్ ద్వారా సీఈఓకు అందిస్తామని చైర్‌పర్సన్ శ్రీవల్లి చెప్పారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్ వెలగం శ్రీనివాసరావు, పెదపూడి, భట్లపెనుమర్రు, యద్దనపూడి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్
- మొవ్వ, గుడివాడలో ఆసరా చెక్కులు పంపిణీ



కూచిపూడిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



గుడివాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

కూచిపూడి(మొవ్వ): మహిళలు ఆర్థిక సాధికారత, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్దేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో శుక్రవారం ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, ఏపీఎం ప్రధాన రావు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మూడో విడత మొవ్వ మండలంలోని 1120 గ్రూపులకు చెందిన 10,966 మంది అక్కాచెల్లెమ్మలకు రూ.10,21,40,306 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీటీసీ వెలగం రమణ, గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకట రమణ విజయలక్ష్మి, మండల సమైఖ్య అధ్యక్షురాలు తోట నిర్మలకుమారి, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట అంజనేయులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుడివాడరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. గుడివాడ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ హామీని నెరవేరుస్తూ మూడు విడతల్లో ఆసరా చెక్కులను పంపిణీ చేశారన్నారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ రుణమాఫీని ముఖ్యమంత్రి ప్రతి ఏడాది ఇస్తూ మాట నిలబెట్టుకున్నారన్నారు. వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుందరరావు మాట్లాడుతూ మండలంలో 698 గ్రూపుల్లో 7వేల మంది డ్వాక్రా మహిళలకు రూ.5.62 కోట్ల రుణమాఫీని మూడవ విడతగా అందజేశామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మహిళలు మరోమారు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, గుంటాకోడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలేటి ఆంజనేయులు(ఆగస్టిన్), ఎంపీడీవో అనగాని వెంకటరమణ, వెలుగు ఏపీఎం దోమతోటి సాంబశివరావు, గుంటాకోడూరు ఎంపీటీసీ సభ్యుడు అంగడాల శ్రీరామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ డ్వాక్రా మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నాకాళ్ల మీద నేను నిలబడేలా చేశారు



పుట్ట గొడుగుల కల్టివేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నఒంటరి మహిళను. కరోనా కాలంలో వ్యాపారం దెబ్బతినటంతో ఇబ్బందులు పడ్డా. ఇంకా కోలుకోవటం కష్టం అనుకున్నా. నా కుమారుడి చదువుకు సైతం బ్రేకు పడింది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆసరా, అమ్మ ఒడి, వితంతు పింఛన్, సున్నావడ్డీ, రైతు భరోసా పథకాల ద్వారా నాకు చేయూత అందింది. తిరిగి పుట్టగొడుగుల కల్టివేషన్ మొదలు పెట్టా. సీఎం జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

–మేడిశెట్టి ప్రసన్న, రోజా గ్రూపు, అవురుపూడి

శ్రీరాముని పాలనే ఆదర్శంగా జగనన్న పాలన

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ఉండ్రపూడి అడ్డరోడ్డు వద్ద శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

పామర్రు: అయోధ్య నగరాన్ని శ్రీరామచంద్రుడు ఏవిధంగా సుభిక్షంగా పరిపాలించారో దానినే ఆదర్శంగా తీసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందరికీ సంక్షేమ పాలన అందిస్తోందని పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్‌కుమార్ అన్నారు. ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మహా అన్న సమారాధనను ప్రారంభించారు. తొలుత ఆలయంలోని వీరాంజనేయస్వామి వారికి పూజలు చేశారు. సుమారు 20వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఉండ్రపూడి, పోలవరం గ్రామాల సర్పంచ్‌లు తోట పోలాక్షి, మట్టా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు డి.బాల వెంకటేశ్వరరెడ్డి, దామోదరం రెడ్డిబాబు, బి.మధు, సింహాచలం, ఎన్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గుడివాడకు చెందిన శ్రీ మురళీ కృష్ణ కోలాట సమాజం ఆర్గనైజర్‌లు ఎం.రమణమ్మ, పి.హేల బృందం ఎంతో భక్తి తత్పరతతో భక్తి గీతాలను ఆలాపిస్తూ వాటికి అనుగుణంగా కోలాటం చేశారు. అన్నదానానికి రవి కిరణ్ ట్రాన్స్ పోర్టు వారు 20వేల మందికి సరిపడా కూరగాయలు అందించారు. దేవాలయానికి రంగులను అక్షయ ఫుడ్స్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పామర్రు వారు వేయించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ఆలయ ఈవో లోలభట్టు సత్యవతి, మండలి సభ్యులు, ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం రామాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ముదినేపల్లిరూరల్: మండలంలోని పెదగొన్నూరు జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు బంటుమిల్లికి చెందిన ఒక ప్రైవేటు కళాశాల యాజమాన్యం శుక్రవారం పరీక్ష కిట్లను పంపిణీ చేసింది. స్థానిక సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడంకి రాజేష్ చేతుల మీదుగా ఈ కిట్లను అందజేశారు.

చిరు ధాన్యాలతో పోషకాలు

గుడ్లవల్లేరు: గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులకు చిరు ధాన్యాలతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.వాణి అన్నారు. అంగలూరులోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు శుక్రవారం 'పోషణ్ పక్వాడ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలున్న చిరు ధాన్యాలతో పాటు మునగాకు, పాలకూర వంటి ఆకుకూరలతో రకరకాల వంటకాలను తయారు చేసి గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులను అంగన్‌వాడీలు అవగాహన పరిచారు. తక్కువ ఖర్చుతో పోషకాలున్న ఆహార పదార్థాలను తయారు చేసుకుంటే రక్త హీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లలను కూడా సంరక్షించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జె.పల్లవి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, గర్భిణులు, బాలింతలు, బిడ్డ తల్లులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి

వానపాముల(పెదపారుపూడి): అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లా అరవింద్ అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో పీఏసీఎస్ బ్యాంక్ వద్ద శుక్రవారం సంఘ మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధ్యక్షుడు పల్లా అరవింద్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పుణుకొల్లు శివరామప్రసాద్, రైతులు గోళ్ల రత్తయ్య, పడాలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



గుడ్లవల్లేరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉత్తరాఖండ్ ఆది శంకర బ్రహ్మ విద్యాపీఠానికి చెందిన స్వామీ ఆత్మ స్వరూప్ అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీలోని నాల్గవ సంవత్సరానికి చెందిన బి.ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం నుంచి 15 రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ కింద యోగా శిక్షణ సదస్సులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

న్యాయవాదుల్లో ఐక్యత అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రజిని

గుడివాడటౌన్: బార్ అసోసియేషన్‌లో సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.రజిని అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని కోర్టు భవనంలో శుక్రవారం నూతనంగా ఎంపికైన బార్ అసోసియేషన్ సభ్యుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి మాట్లాడుతూ నూతనంగా ఎంపికై న పాలకవర్గం న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలన్నారు. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని కోరారు. నూతన అధ్యక్షునిగా టి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షునిగా సీహెచ్ కుటుంబరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వెంకట రమణ, సంయుక్త కార్యదర్శిగా ఆర్.రవికుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఆర్.నరేష్, లైబ్రేరియన్‌గా పి.వెంకటరాజు, కోశాధికారిగా డి.లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బట్టు సత్యన్నారాయణ, గంటా రమేష్ మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి



గంగాధరపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, తల్లులు, గర్భిణులు

గుడివాడరూరల్: గర్భిణులు, బాలింతలు, తల్లులు ఆహారంలో తప్పనిసరిగా చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతను నిర్మూలించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.అరుణకుమారి అన్నారు. మండలంలోని గంగాధరపురంలో పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, తల్లులు, బాలింతలు, పిల్లలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పోషక ఆహారానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. తప్పనిసరిగా గర్భిణులు, తల్లులు ఆహారంలో చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, పెసలు, కొర్రలు, మినుములను తీసుకోవాలన్నారు. ఇవి తీసుకోవడం ద్వారా అనేక అనారోగ్యాల నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. పిల్లలు, తల్లులకు ఆయా అంగన్‌వాడీల్లోని కార్యకర్తలు పోషక ఆహారం పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణ

కైకలూరు: బార్ అసోసియేషన్ ఎన్నికలు కైకలూరు కోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ హాలులో శుక్రవారం జరిగాయి. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మాడెం వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్ఎస్ రాజు, సెక్రటరీగా బందెల లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీగా చావలి శంకర శాస్త్రి, ట్రెజరర్‌గా జె.గంగా ఫణీంద్ర లక్ష్మి, మహిళా ప్రతినిధిగా ఎండి రజీమున్నిసా, మహిళా సెక్రటరీగా కె.రమాదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.మురళీ పవన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది తుమ్మలపల్లి బాలకృష్ణారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సీనియర్ న్యాయవాదులు టి.శ్రీనివాసరావు, గురజాడ ఉదయ్ శంకర్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, కారే శరత్ బాబు, అడ్డగర్ల రాంబాబు, మాడపాటి సత్యనారాయణరాజు, బి.ఇందిర తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

కైకలూరు: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్‌లో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అర్హ నిర్మాణ సంస్థ నూతన టెక్నాలజీతో నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

గడప గడపలో డ్రైనేజీ సమస్య పరిష్కారం



కోరుకొల్లు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వేదికగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిలుస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో 196వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే గాంధీ మహాత్ముడి విగ్రహానికి నివాళి అర్పించారు. అక్కడ నుంచి ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయిన్ అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కొలతలు వేయించారు. మొత్తం 225 మీటర్ల డ్రెయిన్‌కు గడపగడపకూ మన ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తున్నానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, కోరుకొల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ భావన్నారాయణ

గుడివాడటౌన్(నందివాడ): భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు కూడా గుర్తించాలని నందివాడ తహసీల్దార్ భావన్నారాయణ అన్నారు. నందివాడ గ్రామంలో శుక్రవారం రెవెన్యూశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లౌకిక భారతదేశంలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా రాజ్యాంగం అనేక హక్కులు కల్పించిందన్నారు. మాట్లాడే హక్కు, మత మార్పిడి హక్కు, సాంఘిక హక్కులు ఎన్నో ఉన్నాయన్నారు. వాటన్నింటిపై అవగాహన పెంచుకుని హక్కులను అనుభవిస్తూనే బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎస్ఐ శిరీష, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రామ్మోహన్, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ వైపే జనం



వీరమ్మ తల్లిని దర్శించుకుంటున్న చిత్తర్వు నాగేశ్వరరావు

గుడ్లవల్లేరు: ఏపీలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైపే రాష్ట్ర ప్రజానీకం ఉన్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. మామిడికోళ్లలో వందేళ్లకు పైగా నిర్వహిస్తున్న శ్రీ వీరమ్మ తల్లి సంబరాలకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని తన మొక్కుబడులను తీర్చుకున్నారు. పెత్తందారీ వ్యవస్థ టీడీపీ వైపు ఉంటే, జగన్ పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని చిత్తర్వు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరొక సారి ప్రభుత్వ పగ్గాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చావా నాగేశ్వరరావు, నిరీక్షణరావు, ఉత్సవ కమిటీ వారు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

ఆర్‌జేడీ నాగమణి



పాఠశాలలు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

గుడివాడటౌన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ నాగమణి అన్నారు. గుడివాడ అర్బన్, రూరల్ మండలాల్లోని పాఠశాలల్లో పరీక్షలకు కావలసిన ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. పాఠశాల గదులు, మౌలిక వసతులు తదితర అంశాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 395 హైస్కూళ్లకు చెందిన విద్యార్థులకు ఈనెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఈ పరీక్షలలో పాల్గొంటున్నారని, బాలురు 12,048, బాలికలు 10,388, మొత్తం 22,436 మంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. మొత్తం 143 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ ఎ.రవిప్రకాశ్, ఎంఈఓ శేఖర్ సింగ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లేరు మిగులు భూముల సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కై కలూరు: కొల్లేరులో రీసర్వే పూర్తయిన తర్వాత మిగులు భూములను ఇక్కడ పేదలకు పంపిణీ చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన జయమంగళ వెంకటరమణను ఆటపాకలో ఆయన నివాసం వద్ద పలు గ్రామాల ప్రజలు శుక్రవారం కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు ప్రజల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. పేదల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఎక్కువ పర్యాయాలు సీఎంగా కొనసాగి చరిత్ర సృష్టిస్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, పలు గ్రామాల అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్యానికి పెద్దపీట

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. సీతనపల్లి పీహెచ్‌సీలో ఆయన అధ్యక్షతన శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి సచివాలయాన్ని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌గా నిర్ణయించి ఎంఎల్‌హెచ్‌పీ పోస్టును భర్తీ చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా వాహనాలు వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకుని వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో బయటకు రావాలి

కైకలూరు: క్షణికావేశంలో చిన్న తప్పులు చేసి జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో బయటకు వచ్చి కుటుంబ సభ్యులతో సుఖజీవనం సాగించాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు చెప్పారు. కై కలూరు సబ్‌జైలును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులో వంటశాల, ఖైదీల గదులు, వంటలను పరిశీలించారు. అనంతరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఖైదీలకు చట్టాలపై అవగాన కలిగించారు.

కోదండ రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

పెదపారుపూడి: మండలంలోని యలమర్రు గ్రామంలో ఉన్న శ్రీకోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కోదండరామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ళ వెంకటేశ్వరరావు, కాటూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయాల్లో అప్రమత్తం

తోట్లవల్లూరు: విపత్తుల సమయాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ సిబ్బంది విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్నప్పుడు ప్రాణాలు కాపాడుకోవటం, నీటిలో మునిగినప్పుడు ప్రమాదం నుంచి బయటపడటం, గుండె ఆగిపోయిన సమయాలలో తక్షణం అందించే వైద్య సహాయం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత పాల్గొన్నారు.